క్లుప్తంగా

గృహ సారథులపై బృహత్తర బాధ్యత

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



నాగాయలంక(అవనిగడ్డ): గృహ సారథులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృహత్తరమైన బాధ్యతను అప్పగించారని, ప్రజలకు సేవ చేసేందుకు ఇదొక మంచి అవకాశమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయలంక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం మండల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరుగుతుందని, ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గృహ సారథులు వివరించాలని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మీ, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



గూడూరు: కృష్ణాజిల్లా వీఆర్వోల సంఘం డైరీని గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గూడూరు డీటీ వై. శివశంకర్, వీఆర్వోలు కాకుళ్లేశ్వరరావు, వరప్రసాద్, వెంకటేశ్వరరావు, కల్యాణి, సంఘ నాయకులు కె. అర్జునరావు, కె. సందీప్, ఎ. నళినీకుమార్ పాల్గొన్నారు.

కార్ స్టాండ్‌కు స్థలం కేటాయించాలని వినతి

అవనిగడ్డ: చల్లపల్లిలో కార్ స్టాండ్‌కు స్థలం కేటాయించాలని ట్యాక్సీ స్టాండ్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నాయకులు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సింహాద్రి తహసీల్దార్‌కు ఫోన్ చేసి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలువురు ట్యాక్సీ స్టాండ్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

మచిలీపట్నం- ధర్మవరం రైలు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు మచిలీపట్నం నుంచి మంగళవారం రాత్రి 7.40 గంటలకు బయలుదేరి వెళ్లింది. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ నూతన రైలు సర్వీసు ప్రతి రోజూ మచిలీపట్నం నుంచి రాత్రి 7.40 గంటలకు బయలుదేరి గుడివాడ, విజయవాడ, గుంటూరు, వినుకొండ, గిద్దలూరు, నంద్యాల, ప్రొద్దుటూరు, తాడిపత్రి, అనంతపురం మీదుగా మరుసటి రోజు ఉదయం 11 గంటలకు ధర్మవరం చేరుతుందని స్టేషన్ మేనేజర్ పామర్తి నాగేశ్వరరావు తెలిపారు. అలాగే ధర్మవరంలో సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు మచిలీపట్నం చేరుతుందన్నారు. ఈ రైలు సర్వీసు ప్రతి రోజూ మచిలీపట్నం నుంచి ధర్మవరానికి ఈ సమయాల్లో రాకపోకలు సాగిస్తుందని తెలిపారు.

రేపటి నుంచి మహా శివరాత్రి పూజలు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్ పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి 18వ తేదీ వరకు మహా శివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు గో పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం కుంకుమపూజలు, మహాశివుని విగ్రహం వద్ద విశేష పూజలు జరుగుతాయని చెప్పారు. 17వ తేదీ నవగ్రహ సహిత రుద్రహోమం నిర్వహిస్తామన్నారు. 18వ తేదీ మహా శివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున నాలుగు గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రాత్రి ఏడు గంటలకు మహాశివుని విగ్రహం వద్ద విశేష పూజలు, మంగళ హారతులు కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

బోధనా సామర్థ్యం పరిశీలన

మండవల్లి : మండలంలోని మొఖాసాకలవపూడి ఎంపీపీ స్కూల్లో టీచ్ ప్రైమరీ అనే క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ టూల్ ఉపయోగించి మంగళవారం ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను సీఆర్పీ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. టీచ్ ఏపీ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామంతో వ్యాధుల నియంత్రణ

బంటుమిల్లి: ప్రతి రోజూ సైకిల్ తొక్కడం, పరిమిత వ్యాయామం చేయడం ద్వారా దీర్ఘకాల వ్యాధులను నియంత్రిచవచ్చని డాక్టర్ వి. జయశ్రీ అన్నారు. పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ఆధ్వర్యంలో మంగళవారం అజాది కా అమృత్ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సైకిల్ తొక్కడం ద్వారా బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులను నివారించవచ్చన్నారు. అనంతరం వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సువర్చల, సూపర్‌వైజర్లు ఎం. ఏసుదాసు, ప్రసాద్, మాజీ సర్పంచ్ అర్జా చలమయ్య, హెచ్‌ఎం ధర్మారావు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ఘంటసాల(అవనిగడ్డ): ఆరోగ్యకర జీవనానికి సైక్లింగ్ దోహదపడుతుందని ఎంపీపీ వేమూరి రజనీకుమారి అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని కొడాలి, ఘంటసాలలో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం సైకిల్ ఫర్ హెల్త్ ర్యాలీ నిర్వహించారు. ఘంటసాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రజనీకుమారి మాట్లాడుతూ ఖర్చు లేకుండా ఆరోగ్యం పొందాలంటే సైకిల్ తొక్కడం ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, కొడాలి సర్పంచ్ సీహెచ్ రాణి, మండల సచివాలయాల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, డాక్టర్లు వేమూరి ప్రమోద్‌కుమార్, డి. దుర్గాభవాని, టి. వెంకటేశ్వరరావు, ఎంఈఓ ఎస్. శివశంకరరావు, కమ్యూనిటీ ఫీల్డ్ ఆఫీసర్ జి. వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు ఎం. శివకృష్ణ, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీరంగవల్లి, జె. మురళీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహనా ర్యాలీ

పెడన: క్యాన్సర్, చక్కెర వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మీనాదేవి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని కొంకేపూడి గ్రామంలో సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మీనాదేవి మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చని చెప్పారు. షుగర్ వ్యాధి విషయంలో ముందు నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమన్నారు. వంశపారంపర్యంగా వచ్చే ఈ వ్యాధి విషయంలో కుటుంబ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఆహార అలవాట్లను మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దావు భైరవలింగం, ఎంపీహెచ్‌ఈఓ ఎం. వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

● గూడూరు: క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పిస్తూ మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గూడూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ టి. మాధూరి మాట్లాడుతూ క్యాన్సర్‌కు చికిత్స అందుబాటులో ఉందన్నారు. క్యాన్సర్ బారిన పడిన వారు ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. చికిత్స ద్వారా పూర్తిగా నయం పొంది పూర్వంవలే యథావిధిగా పనులు చేసుకోవచ్చునని చెప్పారు. మనో ధైర్యంతో దీనిని జయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగం సులోచనారాణి, విజయకుమారి, ఎంపీహెచ్‌ఈఓ ఏడుకొండలు, సిబ్బంది సరళకుమారి, రామచంద్రరావు, కోటేశ్వరరావు, మౌనిక, హేమలత, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● పెదకళ్లేపల్లి(మోపిదేవి): క్యాన్సర్ మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలాలని అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. పెదకళ్లేపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీలు కడవకొల్లు సీతారామాంజనేయులు, ఆశాదేవి, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హారిక, చల్లపల్లి సీఐ జి. శ్రీనివాస్, ఎస్‌ఐలు చినబాబు, శ్రీనివాస్, జెడ్పీ పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఘంటసాలలో ర్యాలీ చేస్తున్న ఎంపీపీ రజనీకుమారి



గూడూరు హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న మల్లవోలు పీహెచ్‌సీ సిబ్బంది



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు



పెదకళ్లేపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా

అభివృద్ధే అజెండాగా ముందుకు..

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతోంది. నగరంలోని పలు అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ కోవలోనే పలు అభివృద్ధి పనులను ముందస్తుగానే చేయించి ఆయా పనుల నిర్వహణకు సంబంధించిన మొత్తాలకు ఆమోదం తెలిపేందుకు కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. లక్షలాది రూపాయల అభివృద్ధి పనులతో పాటు 1 నుంచి 25వ డివిజన్ వరకు ఖాళీ స్తంభాలకు ఎల్ఈడీ స్ట్రీట్ లైట్ల ఏర్పాటు తదితర అభివృద్ధి అంశాలను అజెండాలో పొందుపరిచారు.

రూ. 16.67 లక్షలతో ప్రధాన పార్కు అభివృద్ధి ..

44వ డివిజన్‌లో మాకర్ల వెంకటస్వామి నాయుడు మునిసిపల్ ప్రధాన పార్కులో రూ. 16.67 లక్షలతో చేసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి నిధులను మంజూరు చేసేందుకుగానూ ఉంచిన అంశాలకు సమావేశం ఆమోదం తెలపనుంది. ఈ పనుల నిర్వహణకు గానూ ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సూచన మేరకు నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ముందస్తు ఆదేశాలతో పనులు నిర్వహించారు. ముఖ్యంగా పార్కులో షటిల్‌కోర్టుల ఏర్పాటు, మ్యూజికల్ ఫౌంటేన్‌కు 3డీ పెయింటింగ్, పిల్లలు ఆడుకునే గ్రౌండ్‌కు ఫెన్సింగ్, పార్కు ప్రవేశ ద్వారం, కాంపౌండ్ వాల్ పెయింటింగ్, కొత్త బెంచీల ఏర్పాటు, పార్కులోని ఫౌంటేన్ల మరమ్మతు పనులు నిర్వహించారు. ఈ పనులకు సంబంధించి నిధుల విడుదలకు సమావేశం ఆమోదం తెలపనుంది.



మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయం

అజెండాలోని అంశాలు..

● నగరంలోని 50 డివిజన్లలో పారిశుద్ధ్య పనులకు వినియోగించేందుకు నాలుగు టన్నుల చీపుర్లను కొనుగోలు చేసేందుకు సంబంధించిన అంశాన్ని అజెండాలో ఉంచారు. రూ. 2.80 లక్షల అంచనాలతో ఈ అంశాన్ని అజెండాలో ఉంచారు.

● నగరంలో గతం నుంచి జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నిర్వహించిన కాంట్రాక్టర్ల వద్ద మినహాయించిన డిపాజిట్లను చెల్లించే అంశాన్ని అజెండాలో మొదటి అంశంగా ఉంచారు. కాంట్రాక్టర్లకు 2.05 లక్షల మేర డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది.

● నగర పాలక సంస్థలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించిన పీఎఫ్, డీఏ ఎరియర్స్‌ను చెల్లించాల్సి ఉంది.

● మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయం కుడివైపున ఉన్న ప్రహరీ కూలిపోవడంతో దానిని పునర్నిర్మించారు. దీని అంచనా రూ. 3.44 లక్షలు కాగా ఈ మొత్తాన్ని కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది.

● పాండురంగస్వామి ఉత్సవాల సందర్భంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల పనులకు రూ. 4.97 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలపాల్సి ఉంది.

సమన్వయంతో ఉత్సవాలు జయప్రదం చేయండి

మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి మహా శివరాత్రి ఉత్సవాలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని మచిలీపట్నం ఆర్డీఓ కిషోర్ అన్నారు. పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వరస్వామి వారి ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయని, అందులో భాగంగా 18వ తేదీ మహా శివరాత్రి కృష్ణానదిలో పుణ్యస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు సుమారు 70 నుంచి 80 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. 19వ తేదీ రథోత్సవం ఉన్నందున అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులు స్వామివారి దర్శనం అనంతరం ఇంటికి క్షేమంగా చేరేవరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా స్నాన ఘాట్స్ వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్యం, తాగునీరు ఏర్పాటు చేయాలని చెప్పారు. లైఫ్ జాకెట్స్‌తో గజ ఈతగాళ్లు, బోట్లు సిద్ధంగా ఉండాలని, ఆర్టీసీ బస్సులు, విద్యుత్ సరఫరా, తగినంత పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కృష్ణానది వద్ద స్నానఘాట్స్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంపీడీఓ పార్వతి, సర్పంచ్ అరజా సంధ్యారాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కడవకొల్లు నరసింహారావు, ఎంపీటీసీ ఆషాదేవి, అధికారులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్నానఘాట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిషోర్, తహసీల్దార్ నవీన్‌కుమార్

సేవలు విస్తృతం చేయాలి

బందరు ఎమ్మెల్యే పేర్ని నాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

కోనేరుసెంటర్: నియోజకవర్గంలో వలంటీర్లతో పాటు గృహ సారథులు ప్రజలకు సేవలు విస్తృతం చేయాలని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. మంగళవారం ఆయన నియోజవర్గంలోని పలు డివిజన్లకు చెందిన గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లతో గోల్డ్ కన్వెన్షన్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, నియోజకవర్గ కన్వీనర్లు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

ఆత్మ అదనపు సంచాలకులు ప్రమీల

ఘంటసాల(అవనిగడ్డ): రబీ సాగు వివరాలను ప్రతీ రైతు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఆత్మ అదనపు సంచాలకులు డి. ప్రమీల అన్నారు. పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకునేందుకు, ప్రభుత్వం నుంచి సేవలు పొందేందుకు నమోదు తప్పనిసరని చెప్పారు. ఘంటసాల మండల పరిధిలోని తెలుగురావుపాలెంలో మంగళవారం ఆమె ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంట వివరాలు, క్షేత్ర స్థాయిలో ఉన్న పంట వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ ఈకేవైసీ చేసుకోవడం ద్వారా అధికారికంగా రైతును సాగుదారుడిగా పరిగణిస్తారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంట నష్టపోయినా, ఇతర సమస్యలు తలెత్తినా ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు, అధికారులు పరిశీలన చేసేందుకు ఈ క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ప్రతి రైతు ఈ క్రాప్ చేసుకోవాలని సూచించారు. దీనిపై రైతులకు అవగాహన పెంపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు చేస్తున్న మినుము, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మొవ్వ ఏడీఏ ఎస్. శ్యామల, ఏఓ మురళీకృష్ణ, వీఆర్‌ఓలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



మినుము పంటను పరిశీలిస్తున్న ప్రమీల

జగనన్న లే అవుట్స్‌కు విద్యుత్ సరఫరా



మోపిదేవి: మోపిదేవి జగనన్న కాలనీ లే అవుట్స్-1, కె. కొత్తపాలెం లే అవుట్స్‌కు మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా చేశారు. ఉయ్యూరు డివిజన్ విద్యుత్ ఈఈ సీహెచ్ రామ్ బొట్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా లే అవుట్స్‌లో చేపట్టిన గృహ నిర్మాణాలకు, వీధి లైట్లు వెంటనే ఏర్పాటు చేశామని తెలిపారు. మోపిదేవి లే అవుట్-1లో 73 ప్లాట్స్, కె. కొత్తపాలెం లే అవుట్స్‌లో 63 ప్లాట్స్ మొత్తం 136 ప్లాట్స్‌కు ప్రభుత్వం రూ. 23 లక్షల వ్యయంతో 100 విద్యుత్ స్తంభాలు, 100 కేవీ టాన్స్‌ఫారం, రెండు 15 కేవీ ట్రాన్స్ ఫారాలు ఏర్పాటు చేశామని వివరించారు. మోపిదేవి మండల ఏఈ పాండురంగారావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి పరీక్షలు

గుడివాడటౌన్: దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి గురువారం పరీక్షలు నిర్వహిస్తామని సమగ్రశిక్ష గుడివాడ యూనిట్ నిర్వాహకులు నీలాంబ్రమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్లో ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు జరుగుతాయన్నారు. వీల్‌చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, రోలేటర్స్, క్యాలిబర్స్, బ్రెయిలీ కిట్స్ అందజేస్తారని తెలిపారు. గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ, పెదపారుపూడి, ఉంగుటూరు, బాపులపాడు, గన్నవరం మండలాల వారికి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

వెలువోలు (చల్లపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం యార్లగడ్డ గ్రామ సచివాలయ పరిధిలోని వెలువోలులో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని 217 ఇళ్లకు వెళ్లి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అవనిగడ్డ నియోజకవర్గంలో 150 రోజుల్లో 45 గ్రామ సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేశామని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విశ్వాసం ప్రజల కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీకి అత్యధిక సీట్లతో అధికారం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, కర్రా రవి, పీఏసీఎస్ చైర్మన్లు శీరం వెంకట సత్యనారాయణ, పాగోలు నాగ సీతారామారావు, అరజా శివశంకర్, సర్పంచ్‌లు వేములమడ రజిత, యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, కొల్లూరి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వేములమడ సతీష్, గ్రామ కన్వీనర్ కుంపటి గంగాధరరావు, ఏఎంసీ డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్ పాల్గొన్నారు.



బ్రోచర్ అందజేసి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రుణాల మంజూరు వేగవంతం చేయండి

కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): టిడ్కో లబ్ధిదారులకు ఆయా బ్యాంకు అధికారులు రుణాల మంజూరును వేగవంతం చేయాలని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో గుడివాడ టిడ్కో లబ్ధిదారులకు సంబంధించిన రుణాల మంజూరు అంశంపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గుడివాడ టిడ్కో లబ్ధిదారుల్లో 7,328 మందికి బ్యాంకు రుణాలు అవసరం కాగా ఇప్పటి వరకు 5,552 మందికి రూ. 148.19 కోట్ల రుణాలు మంజూరు చేశాయన్నారు. మిగిలిన వారికి వెంటనే రుణాలు మంజూరు చేసేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను స్వీకరించి రుణాలు ఇవ్వాలన్నారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి కార్యక్రమం ఉండవచ్చునని, ఈలోగా టిడ్కో లబ్ధిదారులు గృహాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని మునిసిపల్, రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. టిడ్కో ప్రాజెక్టు డైరెక్టర్ చిన్నోడు, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

టూరిస్ట్ పోలీస్‌తో మరింత భద్రత

● ఏఎస్పీ రామాంజనేయులు
● మోపిదేవిలో టూరిస్ట్ పోలీస్ ప్రారంభం

మోపిదేవి: టూరిస్టులకు మరింత భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా టూరిస్ట్ పోలీస్ విధానాన్ని ప్రవేశపెట్టారని ఏఎస్పీ ఎన్వీ రామాంజనేయులు అన్నారు. మోపిదేవిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం వద్ద మంగళవారం టూరిస్ట్ పోలీస్‌ను ప్రారంభించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆన్‌లైన్‌లో వర్చువల్ విధానంలో ప్రారంభించగా రాష్ట్ర వ్యాప్తంగా 22 టూరిస్ట్ పోలీస్ కేంద్రాలు ప్రారంభించారని తెలి పారు. మన ప్రాంతంలో మచిలీపట్నం మంగినపూడి బీచ్ వద్ద, మోపిదేవిలో అవుట్‌పోస్టు వద్ద ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో 20 పర్యాటక ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీస్ కేంద్రాలు ప్రారంభించగా అందులో మోపిదేవి ఒకటన్నారు. అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా, చల్లపల్లి సీఐ జి. శ్రీనివాస్, ఎస్ఐ చినబాబు, ఘంటసాల ఎస్ఐ కె. శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మోపిదేవిలో ప్రారంభించిన టూరిస్ట్ పోలీస్ కేంద్రం

ఆర్థిక అక్షరాస్యతతోనే కుటుంబ శ్రేయస్సు

అవనిగడ్డ: ఆర్థిక అక్షరాస్యతపై కుటుంబం శ్రేయస్సు ఆధార పడి ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఉమారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్సఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలు తెరచి పొదుపు చేసుకోవాలని, నేటి పొదుపే రేపటికి రక్షణ అని చెప్పారు. ఈ సందర్భంగా బ్యాంకు సేవల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ అమిద్‌కృష్ణ, అధ్యాపకులు వీరకుమారి, కె. అంకారావు, ఐక్యూఏజీ సమన్వయకర్త బి. సంధ్యశ్రీ, సంస్థ కౌన్సిలర్స్ దోనె సుధీర్, భార్గవ్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఉమారాణి

మందులతో కుష్ఠు వ్యాధి నియంత్రణ

జిల్లా వైద్యాధికారి గీతాబాయి

ఘంటసాల(అవనిగడ్డ): కుష్ఠు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా ప్రేమతో మెలగాలని కృష్ణా జిల్లా వైద్యాధికారి జి. గీతాబాయి అన్నారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెంలో మంగళవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి అనేది మందులతో తగ్గించుకోవచ్చని చెప్పారు. సకాలంలో గుర్తించి క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడితే తగ్గిపోతుందన్నారు. వ్యాధిగ్రస్తులపై ప్రేమ, ఆప్యాయత చూపించాలన్నారు. దీనివల్ల వారిలో మనోధైర్యం పెరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన పెయింటర్స్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 150 మంది కుష్ఠు, టీబీ వ్యాధిగ్రస్తులకు ప్లేట్లు, దుప్పట్లు, గ్లాసులు అందించారు. కార్యక్రమంలో లెప్రసీ జిల్లా కంట్రోల్ అధికారి వెంకట్రావ్, అసిస్టెంట్ మలేరియా అధికారి పీఎస్ రాజు, ఘంటసాలపాలెం సర్పంచ్ దోనె రజనీకుమారి, డాక్టర్లు ప్రతిభా భూషణ్, నిఖిత, వి. ప్రమోద్‌కుమార్, టి. వెంకటేశ్వరరావు, డి. దుర్గాభవాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలంలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకట్రావు పేర్కొన్నారు. నందివాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ జి శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ రాధాకృష్ణలతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.